నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 3 జూలై 2024 | HYDERABAD

పగలు ఎండ.. రాత్రి వాన

సిటీబ్యూరో, జూలై 2 (నమస్తే తెలంగాణ): మంగళవారం రాత్రి నగరవ్యాప్తంగా పలు ప్రాంతాలలో వర్షం విస్తృతంగా కురిసింది. గ్రేటర్ జీహెచ్ఎంసీ కార్యాలయ ప్రాంతంలో 3.6 సెంటీమీటర్లు, గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద 1.2 సెం.మీ.లు, రాయదుర్గం వార్డు ఆఫీస్‌తో పాటు యూసుఫ్‌గూడ, ఫిల్మ్ నగర్, పటాన్‌చెరు తదితర ప్రాంతాల్లో 1.0 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది. కాగా పశ్చిమ, నైరుతి దిశల నుంచి కిందిస్థాయి గాలులు తెలంగాణ వైపునకు వీస్తుండడంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 33.6డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24.6డిగ్రీలు, గాలిలో తేమ 52శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

సమస్యలపై మాగంటి శంఖారావం

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ శంఖారావం పూరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా సమస్యలపై శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ.. ఇందులో భాగంగా తాగునీటి సమస్య పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాల వల్ల వివిధ శాఖలకు చెందిన అధికారులు వారి పరిధిలోని సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించిన వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. - ఎర్రగడ్డ, జూలై 2

డెంగీ కేసు నమోదైతే వెంటనే వివరాలివ్వండి

కలెక్టర్ అనుదీప్ ఆదేశం

సిటీబ్యూరో, జూలై 2 (నమస్తే తెలంగాణ): నగరంలో అన్ని ఆస్పత్రుల్లో నమోదయ్యే డెంగీ కేసుల వివరాలను ఎప్పటికప్పుడు డీఎంహెచ్ఓకు తెలియజేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే వారిపై క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డెంగీ వ్యాధి నివారణపై హైదరాబాద్ కలెక్టరేట్‌లో మంగళవారం వైద్యాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అనుదీప్ మాట్లాడుతూ డెంగీ వ్యాధిని పూర్తిగా నివారించేందుకు వైద్యాధికారులు అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, దోమల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. నగరంలోని అన్ని వార్డులు, సర్కిళ్లు, యూపీహెచ్‌సీల వారీగా 2019 నుంచి 2024 వరకు నమోదైన డెంగీ కేసుల గణాంకాలు తీసుకోవాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గృహాల్లో నీరు నిల్వ ఉండకుండా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో డెంగీ కేసులు అధికంగా నమోదయ్యే అవకాశం ఉన్నందున వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట్, జీహెచ్ఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రాంబాబు, చీఫ్ ఎంటమాలజిస్టు డాక్టర్ హర్ష పాల్గొన్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్థం

నగరంలో ప్రధాన రహదారుల్లోనే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. అన్ని సర్కిళ్లలో స్వచ్ఛ ఆటోలు ఉన్నా వాటిని నిర్వహించడంలో నగరవాసులకు అవగాహన కలిపించడంలో బల్దియా సిబ్బంది విఫలమవుతున్నారు. ముషీరాబాద్‌లోని బాపూజీ నగర్‌లో రహదారిపై చెత్త పేరుకుపోయిన దృశ్యం

సమన్వయం కుదిరేనా?

బల్దియాకు సమాంతరంగా హైడ్రా విభాగం ఏర్పాటు

ఒక కమిషనరా? ఇద్దరు కమిషనర్లా?

ఎవరు ఎవరికి జవాబుదారీ?

రానున్న వర్షాకాలం సమస్యల వలయం

జీహెచ్ఎంసీ పాలన మరింత గందరగోళం

సిటీబ్యూరో, జూలై 2 (నమస్తే తెలంగాణ): క్షేత్రస్థాయి పర్యటనలు లేవు. పారిశుధ్యం పడకేసింది. దోమలతో డెంగీ కేసులు పెరిగిపోతున్నాయి. వీధికుక్కలతో నగరవాసులు బిక్కుబిక్కుమంటున్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. కొత్త ప్రాజెక్టులేవీ లేవు. పాత ప్రాజెక్టుల పురోగతి తెలియదు. సమస్యలు తీర్చాల్సిన ప్రజావాణి మొక్కుబడిగా సాగి ఏ సమస్యా తీర్చకుండానే ముగుస్తున్నది. ఇలా జీహెచ్ఎంసీ పాలన అత్యంత మందకొడిగా సాగుతున్న నేపథ్యంలోనే ఆ శాఖకు మరో కొత్త ఇబ్బంది ఎదురైంది. నిన్నటి వరకు జీహెచ్ఎంసీలో ఓ విభాగంగా పనిచేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఈవీ అండ్ డీఎం) పేరు మార్చి రాష్ట్ర ప్రభుత్వం ఆ స్థానంలో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా)ను ఏర్పాటు చేసింది. దీనికి ప్రత్యేకమైన మార్గదర్శకాలు, విధులు ఖరారు చేసే కసరత్తు జరుగుతున్నది. ఈ నేపథ్యంలోబల్దియా పరిధిలోకి హైడ్రా వస్తుందా? రాదా? లేదా బల్దియాకు సంబంధం లేకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారా? అనే విషయమై తీవ్ర సందిగ్ధత నెలకొన్నది.

ఎవరి బాధ్యత ఎంత వరకు?

కోటిన్నరకు పైగా జనం నివాసం ఉంటున్న జీహెచ్ఎంసీ పరిధి చాలా విస్తృతంగా ఉంటుంది. బల్దియాలో అన్ని విభాగాలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటే తప్ప పరిపాలన సవ్యంగా సాగదు. అయితే ఇప్పటివరకు బల్దియాలో ఈవీ అండ్ డీఎం ఒక విభాగంగా పనిచేసింది. పారిశుధ్య వాహనాల నిర్వహణ, అక్రమ నిర్మాణాలపై నిఘా, అడ్వర్టైజ్‌మెంట్ ఫ్లెక్సీలు, హోర్డింగుల నిర్వహణ ఈవీ అండ్ డీఎం విభాగపు ముఖ్య బాధ్యతలుగా ఉండేవి. జీహెచ్ఎంసీ పరిధిలో ఎక్కడ ఏ సమస్య ఉత్పన్నమైనా బల్దియా కమిషనర్ ఆదేశాల మేరకు పని చేసేది. బల్దియా కమిషనర్‌తో సమన్వయం చేసుకుంటూ ఈవీ అండ్ డీఎం డైరెక్టర్ విధులు నిర్వర్తించేవారు. జీహెచ్ఎంసీలో ఈవీ డీఎం విభాగాన్ని కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందుకు ఐపీఎస్ అధికారిని డైరెక్టర్‌గా నియమించి బాధ్యతలు అప్పగించింది. ఈ విభాగం ఏర్పాటుతో నగరంలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ విపత్తులు సంభవించిన డీఆర్ఎఫ్ బృందాలు వెళ్లి అక్కడ సేవలు అందించేవి. ఇప్పటి వరకు ఇద్దరు ఐపీఎస్ ఆఫీసర్లు విశ్వజిత్ కంపాటి, ప్రకాశ్‌రెడ్డి డైరెక్టర్‌లుగా బాధ్యతలు నిర్వర్తించి తమ మార్కును చూపించారు. కానీ ఇటీవల హైడ్రా ఏర్పడిన తర్వాత ఆ విభాగానికి డైరెక్టర్ కాకుండా కమిషనర్ స్థాయి పోస్టును ఏర్పాటు చేశారు. హైడ్రా కమిషనర్‌గా డీఐజీ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పజెప్పారు. పాత పద్ధతిలో ఈవీ అండ్ డీఎం డైరెక్టర్ అటు మేయర్‌కు ఇటు బల్దియా కమిషనర్‌కు రిపోర్ట్ చేసేవారు. కానీ నూతనంగా నియమితులైన హైడ్రా కమిషనర్ రంగనాథ్ సరాసరి సీఎం రేవంత్ రెడ్డికే రిపోర్ట్ చేయడం గమనార్హం. ఈ క్రమంలో జీహెచ్ఎంసీకి సమాంతరంగా హైడ్రాను ఏర్పాటు చేశారా అనే సందేహాలు నెలకొన్నాయి. అదే నిజమైతే అటు బల్దియా ఇటు హైడ్రా.. ఎవరెవరు ఏ ఏ బాధ్యతలు, విధులు నిర్వర్తించాలనే విషయమై స్పష్టత రావాల్సి ఉంది.

హైడ్రా కమిషనర్..చకచకా సమీక్షలు

మరోవైపు.. హైడ్రా కమిషనర్‌గా నియమితులైన రంగనాథ్ బాధ్యతలు స్వీకరించగానే తన పని తాను చేసుకుంటూ వెళుతున్నారు. సాధారణంగా బల్దియా కమిషనర్ ఆదేశిస్తేనే ఈవీ అండ్ డీఎం డైరెక్టర్ కూల్చివేతలకు ఉపక్రమించాలి. కానీ వారం రోజుల క్రితం లోటస్‌పాండ్ వద్ద పార్కు స్థలాన్ని కబ్జా చేశారని బల్దియాతో సంబంధం లేకుండా ఈవీడీఎం కమిషనరే స్వయంగా కూల్చివేతలకు ఆదేశించారు. అయితే ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటే ప్రజా సమస్యల పరిష్కారం ఏ మేరకు సఫలమవుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అన్నింటి కంటే మించి కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులకు జవాబుదారీతనంగా ఏ కమిషనర్ ఉంటారు? అన్నది ప్రశ్నార్థకం. వీటన్నింటికీ తోడుగా ఈ నెల 6వ తేదీన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం ఏర్పాటు కానున్నది. కౌన్సిల్ మీటింగ్‌లో ఎక్కువగా పారిశుధ్యం, అక్రమ నిర్మాణాలు, అడ్వర్టైజ్‌మెంట్ పైనే సభ్యులు చర్చ సాగిస్తారు. ఈ అంశాలకు సంబంధించి ఈవీ డీఎం పాత్ర ఎంతో కీలకం. అయితే ఈ సర్వసభ్య సమావేశానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ వస్తారా అనేది తేలాల్సి ఉంది. కాగా, గడిచిన కొన్ని రోజులుగా ఈవీడీఎం కార్యకలాపాలు జీహెచ్ఎంసీ కమిషనర్ ప్రమేయం లేకుండానే జరుగుతున్నాయి. అయితే వర్షాకాలం ముంగిట 'హైడ్రా' అంశం రావడం, ఈవీడీఎం కార్యకలాపాలైన బల్దియాకు ఆదాయాన్ని సమకూర్చే అడ్వర్టైజ్‌మెంట్, ట్రాన్స్‌పోర్టు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రోల్ ఎలా ఉంటుంది? ఈ విభాగాలకు సంబంధించి రిపోర్టులు ఇద్దరు కమిషనర్లకు వెళ్తాయా? ఉద్యోగుల డ్యూటీలు ఎలా ఉండబోతున్నాయి? అన్నది ఆసక్తిగా మారింది.

ప్రతి ఆరు రోజులకు ఫాగింగ్ చేయండి

సిటీబ్యూరో, జూలై 2 (నమస్తే తెలంగాణ): నగరవ్యాప్తంగా డెంగీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ అప్రమత్తమైంది. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రవికిరణ్ మంగళవారం ఎంటమాలజీ చీఫ్ రాంబాబు, ఇతర అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రతి ఆరు రోజులకొకసారి తప్పనిసరిగా ఫాగింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో లాగ్‌బుక్స్, రికార్డులు సరిగ్గా ఉండేటట్లు చూసుకోవాలని చెప్పారు. డెంగీ కేసులు నమోదవుతున్న ప్రాంతాలు, హాట్ స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టి ఫాగింగ్‌పై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. 4846 కాలనీలలో దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

తబలా రసాలో పాడైన రొయ్యలు

హకునా మరాఠాలో బొద్దింకలు

ఫుడ్ సేఫ్టీ విభాగం తనిఖీలు

సిటీబ్యూరో, జూలై 2 (నమస్తే తెలంగాణ): పేరుకే పెద్ద పెద్ద రెస్టారెంట్లు. వందల కొద్దీ బెస్ట్ రివ్యూలతో మంచి పేరు పొందుతాయి. కానీ అసలు విషయమంతా కిచెన్ రూంలోకి వెళ్లి చూస్తే మేడిపండు మేలిమి రహస్యాలన్నీ బయటపడతాయి. ఫుడ్‌సేఫ్టీ విభాగం నిర్వహిస్తున్న తనిఖీల్లో ఆయా రెస్టారెంట్ల చేదు విషయాలన్నీ వెల్లడవుతున్నాయి. మంగళవారం అధికారులు నానక్‌రాం గూడ తబలా రసాలో 12 కిలోల రొయ్యలు, పాల గడువు ముగిసి ఉన్నాయని గుర్తించారు. అయినా సిబ్బంది వాటిని వినియోగదారులకు విక్రయిస్తున్నారని తేలింది. వంటగది అపరిశుభ్రంగా ఉన్నట్టు, నిల్వ చేసిన ఆహార వస్తువులకు సరైన కవర్లు లేవన్న విషయాన్ని గుర్తించారు. ఈ తనిఖీల్లో భాగంగా గచ్చిబౌలిలోని హకునా మరాఠా కిచెన్‌లో ఫుడ్ హ్యాండ్లర్లు తలపాగా, గ్లౌజులు, అప్రాన్ ధరించకుండా ఉన్నట్లు గుర్తించారు. బొద్దింకల నియంత్రణ కూడా లేదు. కాగా సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు పేర్కొన్నారు.

జలమండలిలో ఒకే చోట తిష్ట వేసిన

ఉద్యోగులకు స్థానచలనం

ఆదేశాలు జారీ చేసిన డైరెక్టర్

సిటీబ్యూరో, జూలై 2 (నమస్తే తెలంగాణ): ఒకే చోట పాతుకుపోయిన ఉద్యోగులను ఇతర చోట్లకు బదిలీలు చేయాలని జలమండలి నిర్ణయించింది. ఈ మేరకు పది సంవత్సరాల నుంచి ఒకే చోట పనిచేస్తున్న జీపీఈ (జనరల్ పర్పస్ ఎంప్లాయి) ఎస్‌పీఈ (స్పెషల్ పర్పస్ ఎంప్లాయి) లను తొలుత బదిలీ చేయాలని డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్ ఆయా డివిజన్ల జీఎంలకు ఆదేశాలు జారీ చేశారు. ఒకే చోట పదేళ్లుగా కొనసాగుతున్న లైన్‌మన్లను కచ్చితంగా మార్చాలని, ఈ బాధ్యత జీఎంలదే అని ఆదేశించారు. కాగా ఈ బదిలీలపై వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్(బీఆర్‌టీయూ) నిరసన వ్యక్తం చేసింది. అవినీతి అధికారులను వదిలేసి చిన్న ఉద్యోగులపై ప్రతాపం చూపడం తగదని బీఆర్‌టీయూ అధ్యక్షుడు జి. రాంబాబు యాదవ్ పేర్కొన్నారు. జలమండలిలో పాలన అస్తవ్యస్థంగా తయారైందని, జీఎం, డీజీఎంలను బదిలీలు చేసిన తర్వాతనే కింది స్థాయి ఉద్యోగులను బదిలీ చేయాలని రాంబాబు యాదవ్ స్పష్టం చేశారు. ఐదేళ్లకు పైబడిన డీజీఎం, మేనేజర్లను బదిలీ చేయాలని గత నెల 19న సర్క్యులర్ జారీ చేసి ఇప్పటి వరకు బదిలీలు చేయడం లేదని ఉద్యోగ సంఘాల నేతలు ఆరోపించారు. డీజీఎంలు 25 నుంచి 30 మంది, మేనేజర్ 50 నుంచి 70 మంది వరకు ఉంటారని, వీరిని బదిలీ చేయడం లేదని యూనియన్ సభ్యులు మండిపడుతున్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

800 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

నకిలీ విత్తనాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలే

శామీర్‌పేట, జూలై 2: కూరగాయల కోసం వాడే ట్రేలను అడ్డం పెట్టి సంచుల్లో నకిలీ పత్తి విత్తనాలను తరలిస్తున్న వారిని మేడ్చల్ పోలీసులు పట్టుకున్నారు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన నల్ల మల్లేశ్ టీఎస్08టీ 6999 నంబర్ గల వాహనంలో సూర్యాపేట నుంచి పత్తి విత్తనాలను మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి తరలిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మేడ్చల్ ఎస్‌వోటీ, శామీర్‌పేట పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా మంగళవారం రాజీవ్ రహదారిపై శామీర్‌పేట వద్ద వాహనాన్ని తనిఖీ చేశారు. విత్తనాల సంచులను గుర్తించకుండా ఉండేందుకు కూరగాయాలు తరలించే ఖాళీ ట్రేలను అడ్డుగా పెట్టారు. ఈ సంచులను తెరిస్తే అందులో నకిలీ పత్తి విత్తనాలు కనిపించాయి. దీంతో డ్రైవర్ మల్లేశ్‌ను అదుపులోకి తీసుకుని 800ల కిలో నకిలి పత్తి విత్తనాలు, ఒక సెల్ ఫోన్, డీసీఎం వాహనాన్ని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితులపై బీఎన్ యాక్ట్, ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ యాక్టుల క్రింద కేసు నమోదు చేశారు. వాహన యజమాని అయిన రాజును కూడా త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని డీసీపీ కోటిరెడ్డి చెప్పారు. కాగా నకిలీ విత్తనాలు ఎవరైనా రవాణా చేస్తున్నట్లు తెలిస్తే 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. రైతులను మోసం చేద్దామనో లేదా తక్కువ ధరకు వస్తున్నాయనో నకిలీ విత్తనాలను ప్రోత్సహిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని కోటిరెడ్డి హెచ్చరించారు. కాగా, నకిలీ విత్తనాల పట్టివేతకు కృషి చేసిన పేట్‌బషీర్‌బాగ్ ఏసీపీ రాములు, శామీర్‌పేట సీఐ శ్రీనాథ్, ఎస్‌వోటీ సీఐ రమేశ్‌లకు రివార్డులను ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఏసీపీ రాములు, సీఐ శ్రీనాథ్, వ్యవసాయ అధికారి రమేశ్, ఎస్ఐలు మునీందర్, హారిక, అనిత, ఏఎస్ఐ రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలా! అయితే నేనేం చేయాలె?

ఎమ్మెల్యేకే నిర్లక్ష్యంగా సమాధానమిచ్చిన ఉప్పల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ

ఆయన తీరుతోనే అక్రమ నిర్మాణాలంటూ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి కాలనీ వాసుల ఫిర్యాదు

ఉప్పల్, జూలై 2: అక్రమ నిర్మాణాలపై బల్దియా సిబ్బంది వ్యవహరిస్తున్న అలసత్వం పరాకాష్టకు చేరుకున్నది. తమను ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో టౌన్‌ప్లానింగ్ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఈ విషయం మరోసారి మంగళవారం తేటతెల్లమైంది. 'అక్రమ నిర్మాణాలు ఉంటే నేనేం చేయాలి' అంటూ ఓ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఏకంగా ఎమ్మెల్యేకే నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఇటీవల పలు కాలనీల్లో బడా వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణాలు చేస్తున్నా టౌన్‌ప్లానింగ్ విభాగం మాత్రం పట్టించుకోనట్టే వ్యవహరిస్తున్నది. అదే సమయంలో నిరుపేదల ఇండ్లకు మాత్రం నోటీసులు జారీ చేస్తూ వారిని ఇబ్బంది పెడుతున్నది. ఈ వ్యవహారంపై అనేకమంది కాలనీ వాసులు వచ్చి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో మొరపెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మంగళవారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో.. టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై పలువురు కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ తీరుతోనే ఉప్పల్‌లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని కాలనీ వాసులందరూ ముక్తకంఠంతో ఆరోపించారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో భారీగా అవినీతి పెరిగిపోయిందని, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ, పేదలను ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఏసీపీ వెంకటరమణను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రశ్నించారు.. 'అక్రమ నిర్మాణాలు ఉంటే నేనేం చేయాలి. వెళ్లిపొమ్మంటే వెళ్లిపోతా' అని వెంకటరమణ మితిమీరిన నిర్లక్ష్యంతో సమాధానమిచ్చారు. దీంతో ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో అనుమతులు లేకుండా వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. కమర్షియల్ నిర్మాణాలు చేస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడంలేదంటూ ఆగ్రహించారు. వీటికి తోడు నిబంధనలు లేని నిర్మాణాలు, వ్యాపార సంస్థలకు ఎందుకు ట్యాక్స్ వేయడం చేయడంలేదని డీసీని ప్రశ్నించారు.

మంగళవారం నాటి సమీక్షలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణను నిలదీస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి